# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 17 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4




## అశోక్‌నగర్‌లో గ్రూప్ 1 అభ్యర్థుల ధర్నా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 21 నుంచి జరగనున్న గ్రూప్ 1 పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ అర్ధరాత్రి హైదరాబాద్‌లోని అశోక్ నగర్ చౌరస్తాలో అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. గతంలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షలో తప్పులు, జీవో 29ను సవరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న అభ్యర్థులను అదుపులోకి తీసుకున్నారు.

## మీ అప్పులకు వడ్డీలు కట్టడానికి కొత్త అప్పులు....



- మీ హయాంలో అక్షరాల రూ. 7 లక్షల కోట్ల అప్పులు
- వాటికి కిస్తీలు, వడ్డీల కోసం ప్రతి రోజు టంచన్‌గా రూ. 207 కోట్లు చెల్లించాలి
- మంత్రి సీతక్క

మిగితా 2వ పేజీలో

## 10 నెలల్లో 80,500 కోట్లు అప్పు



- అప్పు- తప్పు అన్నోళ్లని ఇప్పుడు దేనితో కొట్టాలని
- ఏ కొత్త సాగునీటి ప్రాజెక్టు కట్టలేదు..
- వేల కోట్ల ధనం ఎవరి జేబులోకి వెళ్లినట్టు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మిగితా 2వ పేజీలో

## మేం తీసుకున్న రుణాలు రూ.49,618 కోట్లు



- బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, వడ్డీలకు రూ.56,440 కోట్లు చెల్లించాం
- రాష్ట్ర ప్రభుత్వం చేసిన మూలధన వ్యయం రూ.21,881 కోట్లని
- డిప్యూటీ సీఎం భట్టి కౌంటర్

మిగితా 2వ పేజీలో

## ఐఏఎస్‌లకు హైకోర్టులో షాక్



- కేటాయించిన రాష్ట్రాల్లో చేరాలని కోర్టు సూచన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

డీవోపీటీ ఆదేశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ఐఏఎస్ అధికారులకు హైకోర్టులో షాక్ తగిలింది. తెలంగాణలో పనిచేస్తున్న వాణీ ప్రసాద్, వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, ఆమ్రపాలిని ఏపీకి, అక్కడ పనిచేస్తున్న సృజన, శివశంకర్, హరికిరణ్ తెలంగాణకు వెళ్లాల్సిందేనని ఇటీవల కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ, డీవోపీటీ ఆదేశించింది. డీవోపీటీ ఉత్తర్వులపై క్యాట్ స్టే ఇవ్వకపోవడంతో.. ఇవాళ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్లు వేశారు. జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ ఆలిశెట్టి ధర్మాసనం విచారణ జరిపింది.

కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకుందని ఐఏఎస్‌ల తరఫున న్యాయవాదులు వాదించారు. గత పదేళ్ల అనుభవాన్ని ఉద్యోగుల విభజనకు సంబంధించిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. వ్యక్తిగతంగా ఐఏఎస్‌ల అభ్యంతరాలు, వినతులను వినాలన్న ఆదేశాన్ని కూడా పట్టించుకోలేదని వాదించారు. కనీసం ఏకసభ్య కమిటీ నివేదికను కూడా తమకివ్వలేదని ఐఏఎస్?లు వాదించారు. క్యాట్ తుది తీర్పు ఇచ్చే వరకు తమను రిలీవ్ చేయవద్దని కేంద్రాన్ని, రెండు తెలుగు రాష్ట్రాలను ఆదేశించాలని కోరారు. నవంబరు 4న క్యాట్ తదుపరి విచారణ ఉన్నందున, కనీసం అప్పటి వరకైనా ఆగేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

మరోవైపు అధికారులను రిలీవ్ చేసేందుకు 15 రోజులు సమయం ఇవ్వాలని మంగళవారం తెలంగాణ, ఇవాళ ఏపీ డీవోపీటీని కోరాయి. ఏపీ, తెలంగాణ లేఖలను హైకోర్టుకు ఐఏఎస్ అధికారులు సమర్పించారు. ఐఏఎస్ అధికారుల వాదన సమంజసం కాదని కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ వాదించారు. ఉద్యోగులు ఎక్కడ పనిచేయాలని పరిపాలన వ్యవస్థ నిర్ణయిస్తుందని.. కోర్టులు జోక్యం చేసుకోవద్దన్నారు. స్టే ఇవ్వకూడదన్న క్యాట్ నిర్ణయం సరైనదేనని కేంద్రం వాదించింది. కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లాలన్న తమ ఉత్తర్వులు ఏ విధంగా సమర్థనీయమో పూర్తి వివరాలతో క్యాట్‌లో కౌంటర్లు దాఖలు చేస్తామని ఏఎస్‌జీ తెలిపారు. వాదనల సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

సమాఖ్య దేశంలో రాష్ట్రాలను కూడా విశ్వాసంలోకి తీసుకోవాలి కదా అన్న హైకోర్టు, రెండు రాష్ట్రాల అభిప్రాయాలు కూడా పరిగణనలోకి మరోసారి పరిశీలించాలని డీవోపీటీని ఆదేశించమంటారా అని ఒక దశంలో అభిప్రాయం అడిగింది. అయితే వివాదం తర్వాత తేలుతుంది కానీ, ముందయితే అధికారులు తమకు కేటాయించిన రాష్ట్రంలో చేరాలని పేర్కొంది. బాధ్యతాయుతమైన అధికారులు.. ప్రజలకు ఇబ్బంది కలగనీయవద్దని ధర్మాసనం వ్యాఖ్యానించింది. స్టే ఇస్తూ పోతే ఈ అంశం ఎప్పటికీ తేలదని వ్యాఖ్యానించింది. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు, ఐఏఎస్ అధికారుల పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పు వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే ఏపీకి వెళ్లాల్సిన వాణిప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యారు.

తెలంగాణ నుంచి రిలీవ్ అయిన అధికారుల స్థానంలో ఇన్‌చార్జిలను ప్రభుత్వం నియమించింది. టూరిజంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది.విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మహిళా సంక్షేమశాఖ కార్యదర్శిగా టీకే శ్రీదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవోగా ఆర్‌వీ కర్ణన్, ఆయుష్ డైరెక్టర్‌గా క్రిస్టినాకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

## గోధుమ సహా 6 పంటలకు కనీస మద్దతు ధర పెంపు

- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..
- వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ బుధవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పీఎం అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్‌కు 35వేల కోట్లు ఇచ్చేందుకు ఆమోద ముద్ర వేసింది. రబీ పంట సీజన్‌కు సంబంధించి నాన్-యూరియా ఎరువులకు 24 వేల 475 కోట్ల సబ్సిడీకి పచ్చజెండా ఊపింది. 2025-26 సంవత్సరానికి గాను గోధుమ సహా ఆరు పంటలకు కనీస మద్దతు ధరను పెంచింది. క్వింటాల్ గోధుమపై ఎంఎస్‌పీని తాజాగా 150కు పెంచడంతో గతంలో రూ. 2 వేల 275గా ఉన్న కనీస మద్దతు ధర 2 వేల425కి పెరిగినట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

ఆరు రకాల పంటలు- గోధుమలు, బార్లీ, పప్పు ధాన్యాలు (ఛనా), మసూరి పప్పు (లెంటిల్), ఆవాలు, కుసుమ కనీస మద్దతు ధరను పెంచింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో గోధుమల కనీస మద్దతు ధర రూ. 2,275 నుంచి 5,425 రూపాయలకు పెరిగింది. 150 రూపాయల మేర ఎంఎస్‌పీ పెరిగినట్టయింది. బార్లీ- రూ. 1,850 నుంచి 1,980 రూపాయలు (రూ.130 పెంపు) పప్పు ధాన్యాలు- రూ. 5,440 నుంచి 5,650 రూపాయలు (రూ.210 పెంపు), మసూరి పప్పు- రూ. 6,425 నుంచి 6,700 రూపాయలు (రూ.275 పెంపు), ఆవాలు- రూ. 5,650 నుంచి 5,950 రూపాయలు (రూ. 300 పెంపు), కుసుమలు- రూ. 5,800 నుంచి 5,940 రూపాయల (రూ. 140 పెంపు)కు కనీస గిట్టుబాటు ధర పెరిగింది. ఈ ఆరు రకాల పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను పెంచాల్సిన అవసరం ఉందని అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ కమిషన్ సిఫారసు చేసింది. ఈ సిఫారసులపై కేంద్ర మంత్రివర్గం చర్చించింది. అనంతరం వాటిని యధాతథంగా ఆమోదించింది. అలాగే- వ్యవసాయానికి సంబంధించి ఈ కమిషన్ ఇచ్చిన ఇతర సిఫారసులను కూడా ఆమోదించినట్లు కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

## జమ్ముకశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్ర నేత ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. బుధవారం మధ్యాహ్నం సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన సంబంధిత ఫైలుపై సంతకం చేశారు. అనంతరం జమ్ముకశ్మీర్ ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు చెందిన సెక్రెటరీలతో ఒమర్ సమావేశమయ్యారు.జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు.

శ్రీనగర్‌లోని 'షేర్ ఇ కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్'లో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా తదితరులు ఉన్నారు.ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, పీడీపీ అధ్యక్షురాలు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్, సీపీఐ నేత డీ రాజా కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. ఒమర్ అబ్దుల్లా గతంలో కూడా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత బీజేపీ, పీడీపీ కూటమి అక్కడ అధికారం చేపట్టింది.

## అక్టోబర్ 31 నాటికి రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి



- త్వరలోనే రైతు భరోసా
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అక్టోబర్ 31 నాటికి మిగిలిన రూ.13 వేల కోట్ల రుణమాఫీ పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే రైతు భరోసా కింద రెండు విడతల్లో రూ.15 వేలు రైతులకు అందిస్తామన్నారు

బుధవారం నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్ యార్డ్‌లో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 22 లక్షల తెల్ల రేషన్ కార్డులు కలిగిన రైతులకు రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. నెలాఖరు నాటికి కార్డుల్లేని 4 లక్షల మంది రైతులకు, అదేవిధంగా రూ.2 లక్షలపైన రుణాలు ఉన్న రుణాల మాఫీకి కూడా షెడ్యూల్ ప్రకటిస్తామని అన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా రైతుబంధు ఇస్తామని చెప్పారు. ఈ ఏడాది నుండే రైతు పంటల బీమాను అమలు చేస్తామని, ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి బీమా ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో కోటి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతితో దేశానికి అన్నం పెట్టే విధంగా తెలంగాణ తయారు కానుందని తెలిపారు. జనవరి నుంచి రేషన్ కార్డుల ద్వారా అందరికీ సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించామని, అందుకే సన్న రకాలకు మద్దతు ధరతో పాటు, 500 రూపాయల బోనస్ ఇస్తామని తెలిపారు. ఆయిల్‌పామ్ వల్ల మంచి లాభాలు, దిగుబడి ఉన్నందున రైతులు ఆ పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఐదేండ్లలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని చెప్పారు.

వివరాలు 2వ పేజీలో

# ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పేదల ఇబ్బందులు : కేటీఆర్




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

"కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో హైదరాబాద్ లో పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలు, సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఒక రోజు మూసీ సుందరీకరణ అంటారు. ఒక రోజు నల్గొండకు నీళ్లు అంటారు. ఒక రోజు రూ. లక్షా 50 వేల కోట్లు ఎక్కడివి అంటారు. ఒక రోజు డీపీఆర్ లేనే లేదంటూ అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నారు." అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ బస్తీల్లో ఉండే ప్రజలకు అండగా ఉంటామని రేవంత్ రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డుగా నిలబడుతామని చెప్పారు.

తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. మూసీ నది పరివాహక ప్రజలకు 50 ఏండ్ల కిందట ప్రభుత్వమే పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్లు చేసి ఇచ్చింది. వారి చేత నల్లా బిల్లు, కరెంట్ బిల్లు కట్టించుకుంది. ఇవాళ్నేమో నోటీసులు ఇవ్వకుండా ఇండ్లు కూలగొడుతామని దుందుడుకుగా వ్యవహరిస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. మూసీ సుందీరకరణ, హైడ్రా ఏదైనా కావొచ్చు.. ఏదైనా సరే.. నిర్దిష్టమైన ఆలోచన, పద్ధతి, ప్రణాళిక లేదు. హైడ్రాను బిల్డర్లను, పెద్ద పెద్ద వ్యాపారవేత్తలను బ్లాక్ మెయిల్ చేసి, బెదిరించి వసూళ్లు చేయడానికి వాడుతున్నారని తెలుస్తోంది. ఇది మా పార్టీ స్థిరమైన నిర్ణయం కూడా అని కేటీఆర్ పేర్కొన్నారు.

మూసీ పేరిట జరుగుతున్న దోపిడీ ఏదైతే ఉంది దాన్ని వివరంగా ప్రజల్లోకి తీసుకెళ్తాం. హైదరాబాద్ నగరంలో వంద శాతం సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు పూర్తయ్యాయి. కొన్ని చివరి దశలో ఉన్నాయి. మొన్న ఉప్పల్ నియోజకర్గంలో సీవరేజ్ ప్లాంట్‌ను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కూకట్‌పల్లి, ఫతేనగర్‌లో ఎస్టీపీలు పూర్తయ్యాయి. అంబర్‌పేటలో పూర్తంఐ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. వీటి ద్వారా శుద్ధమైన నీరు దిగువకు పోతోంది. గత ప్రభుత్వాలు చేయలేని పనిని కేసీఆర్ చేశారు. ఇది వాస్తవం.. కొత్తగా ఎస్టీపీల కోసం ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.కొండపోచమ్మ సాగర్ నుంచి ఉస్మాన్ సాగర్‌లోకి నీళ్లు తేవడానికి దాన్ని మూసీకి అనుసంధానం చేయడానికి 1100 కోట్లకు గతంలో కేసీఆర్ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎస్టీపీలు పూర్తి చేసి, మూసీ ద్వారా గోదావరి జలాలను తరలిస్తే.. ఈ రెండు పనులు చేస్తే.. ఆటోమేటిక్‌గా శుద్ధ జలాలు నల్లగొండ జిల్లాకు పోతాయి. మీరు కొత్తగా లక్షా యాభై వేల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. నల్లగొండకు శుద్ధమైన జలాలు ఇస్తున్నాం అని సీఎం సన్నాయి నొక్కులు నొక్కుతూ.. పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

మూసీ సుందరీకరణ విషయంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు ఒక ప్రతిపాదన తీసుకొచ్చాం. 100 శాతం ఎస్టీపీలు చేస్తున్నాం. నాగోల్‌లో అతి తక్కువ ఖర్చుతో సుందరీకరణ చేశాం. మిగతా పనులకు ఆమోదం తెలపండి అని కేసీఆర్ దగ్గరకి వెళ్లాం. కేసీఆర్ అర గంట చర్చించిన తర్వాత.. ఎక్కువ మంది పేదలకు నష్టం జరిగేలా ఉంది. పేదలకు నష్టం కాకుండా.. వాళ్ల పొట్ట మీద కొట్టకుండా.. ఊరు అవతలకు పంపకుండా.. తిరిగి ప్రతిపాదన సిద్ధం చేయాలని చెప్పారు. మానవీయ కోణంలో కేసీఆర్ ఆలోచించారు. నాగోల్‌లో నాలుగైదు కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్స్, ఓపెన్ ఎయిర్ జిమ్స్, పార్కులు, ఉప్పల్ భగయాత్‌లో పక్కన సుందరీకరణ చేశాం. పేదవాళ్ల కడుపు కొట్టలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలకు మీరే కదా అనుతులు ఇచ్చింది. రిజిస్ట్రేషన్లు చేసింది మీరే కదా..! ఇప్పుడు వాటిని కూలగొడితే రిజిస్ట్రేషన్ డబ్బులు రేవంత్ రెడ్డి తిరిగి ఇస్తాడా..? జీవో ఇచ్చాం పోండి అంటే ఎలా..? ఏ చర్చ లేకుండా, అనాలోచితంగా చేస్తామంటే ప్రజలు ఊరుకోరు. మూసీ పరివాహక ప్రాంతానికి రా.. వాళ్ల ముందు పబ్లిక్ మీటింగ్ పెట్టి చెప్పు.. ఎలా మూసీ సుందరీకరణ చేస్తావు..? ఎలా అభివృద్ధి చేస్తావో చెప్పు..? ప్రజలను ఒప్పించి మెప్పించు అని కేటీఆర్ సూచించారు.

పాలన చేతగాక ఈ మాటలు.. ప్రభుత్వ పాఠశాలల్లో చాక్‌పీసులకు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులకు, గురుకుల భవనాలకు కిరాయిలు, తులం బంగారం ఇచ్చేందుకు, పెన్షన్లు, రుణమాఫీకి పైసల్లేవు. కానీ మూసీని లక్షా యాభై వేల కోట్లతో సుందరీకరణ చేస్తామంటున్నారు. వరద సహాయం చేస్తామన్నారు.. ఒక్క రూపాయి సహాయం చేశారా..? నెలన్నర అయింది. ఖమ్మం, మహబుబాబాద్‌లోని వరద బాధితులకు వారి ఖాతాల్లో రూ. 17500 వేస్తామన్నారు. వేశారా..? నీ ప్రాధాన్యత ఏంది.. పేద ప్రజల.. నీ ఖజానా నింపుకోవడమా..? ఢిల్లీ పెద్దలకు, మహారాష్ట్ర ఎన్నికలకు డబ్బులు పంపడమే నీ పనా..? పేద ప్రజలను ఒప్పించకుండా మీ ఇష్టారీతిన పోతామంటే ప్రజల తరపున నిలబడి ఉంటాం. హడావుడి చేసి పేద ప్రజల హక్కులకు భంగం కలిగిస్తామంటే ఊరుకోం.. ప్రజల పక్షాన పోరాడుతాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు

## రేవంత్ రెడ్డి రెండు చీరలు అన్నాడు... గుండు సున్నా చేశాడు



● మాజీ మంత్రి హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

'ఒక చీర కాదు..రేవంత్ రెడ్డి రెండు చీరలు అన్నాడు.దసరా పండుగకు అక్క చెల్లెళ్ళను ప్రభుత్వం నిరుత్సహపరిచింది.రూ.15వేలు రైతుబంధు అన్నాడు..గుండు సున్నా చేశాడు. కేసీఆర్ కిట్ కంటే మంచి కిట్ ఇస్తామని పేద గర్భిణి స్త్రీలను మోసం చేశాడు" అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయం తెలంగాణభవన్‌లో బుధవారం మీడియాతో హరీశ్‌రావు చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఉన్న పథకాలు బంద్ పెట్టడమే తెలంగాణలో కాంగ్రెస్ తెచ్చిన మార్పు అని ప్రశ్నించారు. ముదిరాజ్,గంగపుత్రులంటే సీఎం రేవంత్‌కు చిన్నచూపు.ఆగస్టులో పోయాల్సిన చేప పిల్లలను అక్టోబర్ వచ్చినా పోయలేదు.మేం రూ. 100కోట్లు ఖర్చు చేస్తే..కాంగ్రెస్ ప్రభుత్వం చేప పిల్లల కోసం బడ్జెట్‌లో పెట్టిందే రూ.16కోట్లు.ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు'అని ఎద్దేవా చేశారు.

**ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు**

ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు అని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొంత మంది నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి. కానీ ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తానంటోంది. రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తే ప్రజలపై రూ. 20 వేల కోట్ల భారం పడుతుంది. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం 158 కి.మీ. మేర కేంద్రమే నిర్మిస్తోంది. ఉత్తర భాగం నిర్మాణం కోసం భూసేకరణ ఇంకా ప్రారంభించలేదని హరీశ్‌రావు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి రూ. 5 కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో చెప్పారు. 6 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వెంటనే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## వడ్డీలు కట్టడానికి కొత్త అప్పులు....

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అప్పుల అప్పారావులాగా అందిన కాడల్లా అప్పులు చేసి.. రాష్ట్రాన్ని తిప్పలు పెట్టి, వడ్డీలతో ఆర్థిక వ్యవస్థ నడ్డి విరిచిన మిమ్మల్ని దేనితో కొట్టాలి? ' అంటూ కేటీఆర్‌ను మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ప్రశ్నించారు. కేటీఆర్ ట్వీట్‌కు ప్రతిస్పందిస్తూ ఎక్స్‌వేదికగా కౌంటర్ ఇచ్చారు. 'అప్పులు చాలవన్నట్లు వేల కోట్ల రూపాయల బకాయిలను మీరు చెల్లించలేదు. చేసిన పనులకూ బిల్లులు చెల్లించలేదు. రూ.5 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆరోగ్య శ్రీ బకాయిలు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు, సర్పంచులకు పెండింగ్ బకాయిలు, విద్యుత్ సంస్థలకు బకాయిలు, ఆర్టీసీకి బకాయిలు, గురుకుల భవనాల ఓనర్లకు అద్దె బకాయిలు, ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిధుల పెండింగ్..ఇలా ప్రతి శాఖలో వందల కోట్ల బకాయిలు పెట్టి...ఇప్పుడు బుకాయిస్తే ఎలా కేటీఆర్?' అని నిలదీశారు. 'మీ నిర్వాకంతో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ ఈ పది నెలల కాలంలో రూ.18 వేల కోట్ల పంట రుణాలను ప్రజా ప్రభుత్వం మాఫీ చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళల వంటింటి భారం దించేందుకు రూ. 500 కే గ్యాస్ సిలిండర్, సామాన్యులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పటికే 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తి చేసింది ప్రజా ప్రభుత్వం' అని వివరించారు. అయినా మీరు అప్పులు, బకాయిలు, హామీల గురించి నీతులు చెప్పడం దయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉందని కేటీఆర్‌కు సీతక్క చురకలు అంటించారు.

## 10 నెలల్లో 80,500 కోట్లు అప్పు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రేవంత్ కుర్చీ ఎక్కిన రోజు నుండి మొత్తం రూ. 80,500 కోట్లు అప్పు తీసుకొచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. పది నెలల్లో రూ. 80,500 కోట్ల రికార్డు అప్పులు చేశారని అన్నారు. అప్పు- తప్పు అన్నోళ్లని.. ఇప్పుడు దేనితో కొట్టాలని ప్రశ్నించారు. ఎన్నికల హామీలేవీ తీర్చలేదు..! ఏ కొత్త సాగునీటి ప్రాజెక్టు కట్టలేదు..!! మరి ముఖ్యమంత్రి తెస్తున్న అప్పు ఏమైనట్టు ? 80 వేల కోట్ల ధనం ఎవరి జేబులోకి వెళ్లినట్టు ?? అని నిలదీశారు. బడా కాంట్రాక్టర్ల బిల్లులకే ధారాదత్తం చేస్తున్నారా ? కమిషన్ల కోసం కక్కుర్తి పడే అప్పులు తెస్తున్నారా ?? అని ప్రశ్నించారు. అప్పు.. శుద్ధ తప్పు అని ప్రచారంలో ఊదరగొట్టి అవే అప్పుల కోసం ముఖ్యమంత్రి పాకులాడటమేంటి అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో అప్పులు తీసుకుని ప్రాజెక్టులు కట్టామని.. ప్రతిపైసాతో మౌలిక సదుపాయాలు పెంచామని.. తీసుకున్న రుణంతో దశాబ్దాల కష్టాలు తీర్చామని తెలిపారు. కానీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెస్తున్న అప్పుల "అడ్రస్" ఎక్కడ అని ప్రశ్నించారు. రుణమాఫీ చేయకుండా.. రైతుభరోసా వేయకుండా.. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టకుండా.. నెలలపాటు జీతాలు ఇవ్వకుండా.. ఇన్ని వేలకోట్లు ఏమైనట్టు ? ఎవరి జేబుల్లోకి వెళ్లినట్టు అని ప్రశ్నించారు. రాష్ట్ర సంపద సృష్టికి కాకుండా.. సొంత ఆస్తులు పెంచుకోవడానికి.. అప్పులు చేయడం క్షమించరాని నేరమని వ్యాఖ్యానించారన్నారు.

ఆర్బీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకున్నది. స్వయంగా ఆర్బీఐ మంగళవారం ఈ విషయాన్ని ప్రకటించింది. దీంతో నిరుడు డిసెంబర్ 7న అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు 315 రోజుల్లో రేవంత్‌రెడ్డి సర్కా రు తెచ్చిన అప్పులు రూ.74,495 కోట్లకు పెరిగాయి అని కేటీఆర్ అన్నారు. గత నెలలో 3 దఫాలుగా రూ.4,500 కోట్ల రుణాలు పొందిన రేవంత్ ప్రభుత్వం.. ఈ నెల 1న రూ.2,000 కోట్ల అప్పు తీసుకున్నది. తాజాగా 21 ఏండ్ల కాలానికి బాండ్‌ను జారీచేసి మరో రూ.1,000 కోట్ల అప్పు తెచ్చింది. ఇలా ప్రతి నెలా రూ.5-6 వేల కోట్ల రుణాలు సమీకరిస్తున్న రేవంత్ సర్కారు ఇప్పటివరకు ఒక్క ఆర్బీఐ నుంచే 49,618 కోట్ల అప్పులు తెచ్చింది. ఇవి చాలక కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు గ్యారంటీలు ఇవ్వడంతో మరో రూ.25 వేల కోట్ల వరకు రుణాలను సేకరించిందని తెలిపారు.

## మేం తీసుకున్న రుణాలు రూ.49,618 కోట్లు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో (ఈ నెల 15 వరకు) తీసుకున్న మొత్తం రుణాలు రూ.49,618 కోట్లని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బీఅర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పాత అప్పులు, వడ్డీల కోసమే ఇప్పటి వరకు రూ.56,440 కోట్లు చెల్లించినట్టు ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులు, చేపట్టిన ప్రాజెక్టులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మాజీమంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించిన నేపథ్యంలో డిప్యూటీ సీఎం ఘాటుగా సమాధాన మిచ్చారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు చేసిన అప్పులు, ఖర్చు తదితర అంశాలను భట్టి విక్రమార్క ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన మూలధన వ్యయం రూ.21,881 కోట్లని డిప్యూటీ సీఎం చెప్పారు. రుణమాఫీ, రైతు భరోసా, చేయూత, విద్యుత్, బియ్యం, గ్యాస్ రాయితీలు, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, స్కాలర్‌షిప్‌లు, ఆర్టీసీ, కల్యాణలక్ష్మి పథకాల కోసం రూ.54,346 కోట్లు ఖర్చు చేసినట్టు వివరించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగుల జీతాల చెల్లింపులు చేస్తున్నట్టు తెలిపారు.

## అక్టోబర్ 31 నాటికి రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్‌లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తున్నామని, తర్వాత నల్లగొండలోనూ నిర్మిస్తామని అన్నారు.రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే 24 గంటల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ఎస్ఎల్‌బిసి వద్ద బత్తాయి కోసం నిర్మించిన షెడ్డులో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతపూర్ తర్వాత నల్లగొండ జిల్లాలోనే అత్యధికంగా బత్తాయి సాగు ఉందని, సుమారు 50వేల ఎకరాల్లో బత్తాయి పండ్ల తోటలున్నాయని వివరించారు.

## నాణ్యమైన విద్యతో పాటు
# మౌలిక సదుపాయాలు కల్పించాలి..



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యతో పాటూ అన్ని మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రతీ తరగతి గదిలో విద్యార్థులకు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని తెలుసుకున్నారు.ఇతర వసతులు ఎలా ఉన్నాయి అనే వివరాలను జిల్లా కలెక్టర్ స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గది భవనం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా 6 గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు.టాయిలెట్స్ మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు.ప్రతి తరగతి గదుల్లో ఫ్యాన్లు,లైట్లు ఉండేలా చూడాలన్నారు.వంట చేస్తున్న తీరును పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కాంపౌండ్ వాల్ చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను వెంటనే శుభ్రం చేయాలని ఎం.పీ.ఓ ను ఆదేశించారు. తనిఖీలో ఎం.ఈ.ఓ రాజు, ప్రధానోపాధ్యాయులు శంకర్ నారాయణ్, వెంకటేశ్వర స్వామి, తదితరులు పాల్గొన్నారు.



# రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కోనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలి..

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ, సిరిసిల్ల**

రైతులు నాణ్యమైన, ఆరబెట్టిన వరి ధాన్యాన్ని వరి కోనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం, అవునూరు, ఎల్లారెడ్డిపేట మండలం పదిర, వెంకటాపూర్ గ్రామలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను కోనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా వ్యాప్తంగా 258 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతున్నదని అన్నారు .రైతులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎఫ్ ఏ క్యూ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, 17 శాతం కన్న తక్కువ తేమ ఉండేలా చూసుకోవాలని తాలు, రాళ్ళు, మట్టి గుల్లలు లేకుండా చూసుకోవాలని అన్నారు . ఏ.గ్రేడ్ ధాన్యానికి రూపాయలు 2320/- కామన్ గ్రేడ్ ధాన్యానికి రూపాయలు 2300/- రూపాయలు ధర ప్రభుత్వం నిర్ణయించిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు ధాన్యాన్ని తీసుకు వచ్చేటప్పుడు వారి వెంట పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డు తప్పనిసరి తీసుకురావాలని అన్నారు.వరి ధాన్యం కొనుగోలు లో సెంటర్ నిర్వాహకులు ఎలాంటి అవకతవకలు పాల్పడిన వారి పై తగు కటిన చర్యలు తీసుకుంటామనిఅన్నారు . ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ.శేషాద్రి, అదనపు డిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి రామకృష్ణ ,సివిల్ సప్లై అధికారి వసంత లక్ష్మి, రజిత, తాసిల్దార్ సురేష్ , స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు , సెంటర్ నిర్వాహకులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మరింత చేరువయ్యేలా
# పోలీస్ సిబ్బంది విధులు ఉండాలి



- గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని,గ్రామాల్లో విజబుల్ పోలీసింగ్, నేరాల నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట్ సర్కిల్ కార్యాలయం,ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ ను ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు,అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో సిడి ఫైల్స్, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను పరిశీలించి,కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు.సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ శాంతి భద్రతల పరిరక్షణకు ఆయాఎస్సైల ద్వారా చర్యలు చేపట్టాలని, సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని సూచించారు.

అనంతరం ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డ్స్ ,వర్టికల్స్ అమలు తీరు,స్టేషన్ లో విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పెండింగ్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సిడి ఫైల్స్ లను తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్బంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువఅయ్యేలా పోలీస్ విధులు ఉండాలని,పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామాల్లో తరచు పర్యటిస్తూ ప్రజలతో సస్సంబంధాలు కలిగి ఉండాలని, గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం విపివో ల దగ్గర ఉండాలని ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలన్నారు.



బ్లూ కోల్ట్ సిబ్బంది డయల్ 100 కాల్ రాగానే వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలు పరిష్కరించాలని, రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించే బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు, సస్పెక్ట్ లు, రౌడీ షీటర్లపై నిఘాను ఉంచాలన్నారు.

పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై ,అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ కట్టడి చేయాలన్నారు.సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలి అనిఅన్నారు .ఈ కార్యక్రమం లో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్,ట్రైని ఎస్ఐ రాహుల్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# కళాశాలల బంద్‌తో పేద విద్యార్థులు నష్టపోతారు

- తక్షణమే ఫీజులను విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
- ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్.

**బలగం టీవీ, సిరిసిల్ల**

రాష్ట్రంలో గత ఆరేండ్ల నుండి 8 వేల కోట్ల పైగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్స్ మరియు స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూప్రభుత్వం ఫీజులను విడుదల చేయకపోవడం వల్ల ఇప్పటికే చాలా రకాల ప్రవేశ పరీక్షలు పూర్తి అయ్యి ఉన్నత చదువులకు వెళ్ళేవారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని,పేద విద్యార్థులు తమ అప్పులు చేసి మరి సర్టిఫికేట్స్ తీసుకుంటున్నారు. ఒక్క ప్రక్కన విద్యార్థులు ఇబ్బందులు, మరోవైపు యాజమాన్యాలు అప్పులు తెచ్చి నడిపిస్తున్నామని ,జీతాలు చెల్లించలేమని, కళాశాలల బంద్ కు పిలుపునిచ్చారు అని,దీనిని ప్రభుత్వం యాజమాన్యాలతో చర్చించి పేద విద్యార్థులు నష్టం లేకుండా నిధులు విడుదల చేయాలనిఅన్నారు . రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో డిగ్రీ %ఽ% పి.జి. కళాశాలలు కంటే ప్రైవేట్ రంగంలో ఎక్కువ ఉన్నాయని వాటిలో ఎక్కువ మంది పేద విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బి.సి., మైనారిటీ విద్యార్థులే నష్టపోతారని ,ఒక్క ప్రక్కన విద్యలో విప్లవాత్మక మార్పులంటూ ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రారంభం చేస్తూనే విద్యార్థుల ఫీజులను గత ప్రభుత్వం వలె విద్యారంగానికి ప్రాధాన్యత తగ్గించి విద్యను ప్రైవేట్ రంగంలో మార్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఫీజులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది అన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, నాయకులు సాత్విక్, రాహుల్ ,సాయి భరత్, శివ తదితరులు పాల్గొన్నారు.



# తొలి రోజు ఆట రద్దు



- **కివీస్‌తో భారత్ తొలి టెస్టు..**

**బలగం టీవీ, బెంగుళూరు**

బెంగుళూరులో భారీ వర్షం కురవడంతో కివీస్, భారత్ మధ్య బుధవారం ప్రారంభం కావాల్సిన టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆట రద్దయింది. బెంగుళూరులో ఉదయం నుంచి అడపాదడపా జల్లు కురిసింది. టీ బ్రేక్ తర్వాత .. పిచ్‌ను పరిశీలించిన అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.బుధవారం మధ్యాహ్నానికి వర్షం తగ్గినప్పటికీ ఔట్ ఫీల్డ్ చిత్తడిగా ఉండడం వల్ల తొలి రోజు ఆట రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఈ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చిన అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు.ఇక రెండో రోజుకు కూడా వర్షం ముప్పు ఉందని తెలుస్తోంది. అయితే బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో అధునాతన డ్రైనేజీ సిస్టమ్ ఉండడం కాస్త సానుకూలాంశం.

# అఖండ 2- తాండవం షురూ



**బలగం టీవీ, హైదరాబాద్**

సింహా, లెజెండ్, అఖండ లాంటి బ్లాక్ బస్టర్‌లను అందించిన నందమూరి నటసింహం బాలకృష్ణ, బోయపాటి శ్రీను మరో సినిమాకు సిద్ధమయ్యారు. బాలయ్య. బాలకృష్ణ, బోయపాటి కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'అఖండ 2 – తాండవం' (%ూానెష్టుఅయు 2). బ్లాక్ బస్టర్ చిత్రం అఖండ సినిమాకు సీక్వెల్‌గా ఈ మూవీ తెరకెక్కనుంది. అయితే తాజాగా ఈ చిత్రం బుధవారం పూజ కార్యక్రమాలు పూర్తిచేసుకుంది. ముహూర్తపు షాట్‌కు బాలకృష్ణ కుమార్తె నారా బ్రాహ్మణి క్లాప్ కొట్టగా.. బాలకృష్ణ చిన్న కూతురు తేజస్విని స్విచాన్ చేసింది. ఇక క్లాప్ అనంతరం బాలకృష్ణ మూవీ డైలాగ్‌తో అలరించాడు.ఇక ఈ సినిమాను 14రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి బాలయ్య కూతురు తేజస్విని కూడా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అఖండ తరువాత ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఈ చిత్రం పొలిటికల్ టచ్‌తో ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఏదేమైనా ఈ కాంబినేషన్ అంటేనే అభిమానులకు పూనకాలు గ్యారెంటీ. మరి ఈసారి ఎలాంటి సంచలన సినిమాతో ఈ ఇద్దరూ రాబోతున్నారో చూడాలి.

# వేట్టయన్' టికెట్ రేట్లు తగ్గింపు




**బలగం టీవీ, హైదరాబాద్**

సూపర్‌స్టార్ రజినీకాంత్ నటించిన చిత్రం 'వేట్టయన్– ద హంటర్'. టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ నిర్మించింది. సుభాస్కరన్ నిర్మాతగా వ్యవహరించారు. దసరా సందర్భంగా అక్టోబర్ 10న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి దిల్ రాజు ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేశారు. సీడెడ్ ఏరియాలో శ్రీ లక్ష్మీ మూవీస్ రిలీజ్ చేసింది. అయితే ఇక దసరా సెలవులు ముగియడంతో అందరికీ అందుబాటులో ఉండే విధంగా తెలంగాణలో ఈ మూవీ టికెట్ రేట్లను తగ్గించారు. మల్టీ ప్లెక్సుల్లో రూ.200, సిటీ సింగిల్ స్క్రీన్‌లలో రూ.150, డిస్ట్రిక్ట్ సింగిల్ థియేటర్లలో రూ.110గా టికెట్ రేట్లను ఫిక్స్ చేశారు. ఈ రేట్లు అక్టోబర్ 18 నుంచి అందుబాటులోకి రానున్నాయి. టికెట్ రేట్ల తగ్గింపు వల్ల వేట్టయన్ చిత్రానికి ప్రేక్షకుల తాకిడి పెరుగుతుందని, తద్వారా కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. 'వేట్టయన్' సినిమాలో బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్, మంజు వారియర్, ఫహాద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, రితికా సింగ్, దుషారా విజయన్ వంటి ప్రముఖ నటులు నటించారు. సంగీత దర్శకుడు అనిరుధ్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.




# రూ.23 కోట్లకు హెన్రిచ్ క్లాసెన్..?

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు జరగనున్న మెగా వేలం మరికొన్ని రోజుల్లోనే మొదలు కానుంది. అన్ని జట్లు వేలానికి ముందే తమ రిటైన్ చేసిన ఆటగాళ్ల పేర్లను వెల్లడించాలి. ఈ క్రమంలోనే సన్‌రైజర్స్ హైదరాబాద నుంచి ఓ కీలక వార్త వెలుగులోకి వచ్చింది. ఓ ఆటగాడికి దక్కించుకునేందుకు ఏకంగా రూ. 23 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించనున్నట్లు తెలిసింది.

ఐపీఎల్ వేలానికి సంబంధించిన రిటెన్షన్ నిబంధనలను ఇటీవల బీసీసీఐ ఖరారు చేసింది. మొత్తంగా ఒక్కో ఫ్రాంచైజీ గరిష్ఠంగా ఆరుగురు ప్లేయర్లను అట్టిపెట్టుకోవడానికి అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా వికెట్ కీపర్– బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్‌ను రాబోయే సీజన్‌కి తొలి ఆప్షన్‌గా తీసుకోవాలని భావిస్తోందని సమాచారం. తొలి ఆప్షన్‌గా రిటైన్ చేసిన ఆటగాడికి బీసీసీఐ రూ.18 కోట్ల ధరను నిర్ణయించింది. అయినా క్లాసెన్ కోసం రూ.23 కోట్లు చెల్లించడానికి ఫ్రాంచైజీ సిద్ధంగా ఉందని తెలిసింది. 2024లో క్లాసెన్ అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. 15 ఇన్నింగ్స్‌ల్లో 171.07 స్ట్రైక్ రేట్‌తో 479 పరుగులు చేశాడు.

ఇక ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ పాట్ కమిన్స్, యంగ్ బ్యాటర్ అభిషేక్ శర్మను కూడా రిటైన్ చేయాలని ఎస్ఆర్‌హెచ్ నిర్ణయించుకుందట. జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన కమిన్స్‌ను రూ.18 కోట్లకు అట్టిపెట్టుకొని, అభిషేక్ కోసం రూ.14 కోట్లు వెచ్చించడానికి రెడీ అయిపోయిందని తెలుస్తోంది. ఇక ఆస్ట్రేలియన్ డాషింగ్ బ్యాటర్ ట్రావిస్ హెడ్, టీమ్ఇండియా యంగ్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని కూడా తిరిగి జట్టులోకి సిద్ధంగా ఉంది. ట్రావిస్ హెడ్ 2024లో అత్యుత్తమంగా రాణించాడు. ఓపెనర్‌గా 191.55 స్ట్రైక్ రేట్‌తో 567 పరుగులు చేశాడు. అటు ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్‌గా ఎంపికైన నితీష్ కుమార్ రెడ్డి బ్యాట్‌తో పాటు బంతితోనూ ఆకట్టుకున్నాడు. ఈ ఆటగాళ్లను రిటైన్ చేయాలని సన్‌రైజర్స్ దాదాపు సిద్ధమైపోయినట్లు సమాచారం.




# మిస్టర్ ఫర్‌ఫెక్ట్ రీ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన మిస్టర్ ఫర్‌ఫెక్ట్ రీ రిలీజ్ కాబోతోంది. దశరథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రానికి శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజ్ నిర్మించారు. తాప్సీతో పాటు కాజల్ అగర్వాల్ కథానాయికలుగా నటించారు. 2011 ఏప్రిల్ 21న విడుదలైన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమాను అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అక్టోబర్ 22న రీ రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా మూవీ బుకింగ్స్ స్టార్ట్ అయినట్లు తెలిపింది. అయితే ఇప్పటికే ప్రభాస్ బర్త్‌డే కానుకగా ఈశ్వర్‌తో పాటు రెబల్, సలార్ సినిమాలు విడుదల కాబోతున్నాయి.